

# ధరణి పోతే దళారులదే రాజ్యం

## ధరణి స్థానంలో భూమాత పోర్టల్ అంటున్న కాంగ్రెస్

- పాత రెవెన్యూ వ్యవస్థనే తీసుకొస్తామనడంతో రైతుల్లో గుబులు
- మళ్లీ వీఆర్ఓ నుంచి తాసీల్దార్ వరకు పైరవీలు..

**గతంలో భూమి అమ్మాలన్నా..** కొనాలన్నా.. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు, నెలల తరబడి ఎదురుచూపులు తప్పేవి కావు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ధరణి పోర్టల్ తెచ్చిన తర్వాత సమూల మార్పులు వచ్చాయి. 10నిమిషాల్లో భూ క్రయ విక్రయాలు, మ్యుటేషన్ తాసీల్దార్ పరిధిలోనే పూర్తవుతున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకొస్తే ధరణి తీసేసి భూమాత తెచ్చి పాత రెవెన్యూ వ్యవస్థను కొనసాగిస్తామనడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ధరణి తీసేస్తే మళ్లీ వీఆర్వో నుంచి తాసీల్దార్ వరకు చేతులు తడపడం.. ఆఫీసుల చుట్టూ తిరగడం తప్పదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మ్యానువల్ పహాణీ అమల్లో ఉన్నప్పుడు పైరవీకారులు, లంచగొండిదారులదే రాజ్యమైంది. ప్రస్తుతం ధరణి పోర్టల్ పుణ్యామా అని భూముల గొడవలు పోయి ప్రశాంతంగా ఉంటున్న రైతులు మళ్లీ పాత పద్ధతే తెస్తామంటున్న కాంగ్రెస్ నాయకుల మాటలతో ఆందోళన చెందుతున్నారు. వారిపాలన వద్దేవద్దంటున్నారు.

*– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నవంబర్ 25*






### ధరణితో రైతులకు భరోసా



ధరణి వల్ల భూములకు భరోసా కలిగింది. ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తే పూర్వకాలం నాటి దళారులు, పైరవీదారులు రాజ్యమేలుతారు. దళారుల ప్రమేయం పెరగడం ఖాయం. రైతుల భూముల వివరాలు తారుమారు చేసే అవకాశం ఏర్పడుతుంది. తిరిగి అనుభవదారు, మాన్యం దారు కాలమ్స్ పెడితే నిజమైన పట్టాదారుడికి తిప్పలు తప్పవు. రైతును ఆగం చేసేందుకు కాంగ్రెసోళ్లు ఇట్లా చేస్తుంర్రు. ధరణిని రద్దు చేస్తే గతంలోలెక్క రైతు ప్రమేయం లేకుండానే భూములు ఒకరి పేరు నుంచి మరొకరికి బదిలీ చేస్తరు. ఇప్పుడే మంచిగున్నది.

*– చింతకింది కిష్టయ్య, రైతు, ములుగు*

### 'భూమాత' మాకొద్దు



కాంగ్రెసోళ్లు భూమాతను తీసుకొస్తే ఎనకటి రోజులు మళ్లీ వస్తాయి. భూమాత మాకొద్దు. పల్లెల్లో పట్వారీలు ఒకరి భూమిని మరొకరి పేరే మీద ఎక్కించి రైతుల దగ్గరి నుంచి పైసలు దండుకుంటారు. గిప్పుడు ధరణి ఉండడంతో భూములకు భద్రత ఏర్పడింది. ఊర్లల్లో భూముల సమస్యలు లేకుండా రైతులు సంతోషంగా ఉన్నారు. రైతులను మళ్లీ గోస పెట్టడానికే కాంగ్రెసోళ్లు భూమాతను తీసుకొస్తామంటున్నారు. కర్షకుల సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు వస్తే తరిమికొడతాం.

*– దొందడి రాములు, రైతు, మిరుదొడ్డి*

### కాంగ్రెస్ వస్తే ఎవుసం ఆగమే



పొరపాటున కాంగ్రెస్‌ను నమ్మితే ఎవుసం ఆగమైతది. మూడు గంటల కరెంట్ ఇస్తే పంటలకు సమయానికి నీళ్లందక ఎండిపోయే ప్రమాదం ఉంటుంది. ప్రభుత్వం ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తుంటే కాంగ్రెస్ నాయకులకు ఎందుకు ఓటువేయాలి. 24 గంటల కరెంట్‌ను మూడు గంటలకు ఎందుకు తగ్గించుకోవాలే. రైతుల కష్టాలు చూసి, వారి మేలు కోరే కేసీఆర్ ఉంటేనే రైతు రాజ్యం కొనసాగుతుంది. లేకుంటే రైతుల జీవితాలు ప్రశ్నార్థకమవుతాయి. కాంగ్రెస్ పాలనలో ఎరువుల, కోసం, కరెంట్ కోసం, పండిన పంటలకు గిట్టుబాటు ధరల కోసం ఎన్ని బాధలు పడ్డామో మాకు తెలుసు. *– మాల చంద్రయ్య, రైతు, తునికిబొల్లారం, ములుగు మండలం*

### ధరణిని తీసేస్తే దళారుల రాజ్యం



ధరణి తీసుకొచ్చి భుములపై హక్కులు కల్పించిన నాయకుడు కేసీఆర్. గతంలో పట్వారీలు ఉన్నప్పుడు పహాణీ కావాలంటే వాళ్ల చుట్టూ తిరిగేది.వీఆర్వోలు, పట్వారీలు ఉన్నప్పుడు ఊర్లలో పెద్ద మనుషులు చెప్పితే పాసుపుస్తకాలు రాసిచ్చేవారు. భూమి కొంటే పట్టా అయిన తర్వాత పాసు పుస్తకం కావాలంటే ఏండ్ల కొద్ది తహసీల్ కార్యాలయం చుట్టూ తిరిగిన రోజులు కండ్ల ముందే కనిపిస్తున్నాయి. పట్వారీలు, వీఆర్వోలు ఉన్నపుడు ఒకరి భూములు ఇంకో వ్యక్తిమీద రాసి ఇచ్చేవారు.రికార్డులు అన్నీ తారుమారు అయ్యేవి. ధరణి వల్ల భూములు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. ఇప్పుడు భూమి అమ్మిన వ్యక్తి తహసీల్ కార్యాలయానికి వెళ్లివేలుముద్ర వేస్తేనే కొనుగోలు దారుపేరుమీదికి మారుతుంది. భూముల పంచాయితీలు, పైరవీలు ఎక్కడా లేవు. *– పుసాల నర్సింగరావు.రైతు, గాడిచర్లపల్లి, సిద్దిపేట*



**దళారీ వ్యవస్థను తెచ్చే కుట్రలు**

హుస్నాబాద్, నవంబర్ 25: ఎనకట మా తండ్రులు చెప్పేది. పటేల్, పట్వారీ, దళారులతో భూములు కొందరి చేతుల్లోనే ఉండి మిగతా వాళ్లు కూలీలుగా పనిచేసేటోళ్లని చెప్పేటోళ్లు. ఇప్పుడు కాంగ్రెసోళ్లు ఆ పాత పద్ధతిని తెచ్చేం దుకే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని అంటున్నరు. తహసీల్ ఆఫీసుల చుట్టూ తిరిగి పట్టాదారు పాసు పుస్తకాలు తీసుకోవడం, 20 నుంచి 30 కాలమ్స్ పెట్టి భూమిలో ఇతరులకు హక్కు కల్పించే పద్ధతి మంచిది కాదు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకొని కేవలం అరగంటలోపే రిజిస్ట్రేషన్ చేసుకొని పట్టాదారు పాసుపుస్తకం పొందే సౌకర్యం ఉన్న ధరణిని రద్దు చేస్తామనడం సరికాదు.అవినీతికి తావు లేకుండా చేస్తున్న ధరణిని కొనసాగాల్సిందే. ధరణిని తీసేస్తే మళ్లీ వీఆర్వోలు, ఆర్ఐలు ఒకరి పేరున ఉన్న భూమిని మరొకరి పేరుమీదికి మార్చడం, కొత్త పంచాయితీలు రావడం ఖాయం. డబ్బులు ఇచ్చిన వాని పేరుమీదే రికార్డుల్లో భూమి ఉండే అవకాశం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ధరణి పోర్టల్‌ను తీసేయొద్దు. ధరణిని తీసేస్తామన్న వారికి ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి. *– పాక సురేశ్, రైతు, గోవర్ధనగిరి, అక్కన్నపేట మండలం*

### ధరణితో ధైర్యంగా ఉన్నాము



మేము గజ్వేల్‌లోనే ఉంటున్నాము. మా భూములు సిద్దిపేట దగ్గర మిట్టపల్లిలో ఉన్నాయి. మా ఆయన ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసేన తర్వాత చనిపోయాడు. ఆ తర్వాత భూములు నాపేరు మీదికి వచ్చాయి. అప్పట్లో భూముల వివరాలు గందరగోళంగా ఉండేవి. మా ఆయన కాలం చేసిన తర్వాత భూములు నా పేరు మీద మార్చడానికి మా కొడుకులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఆఖరికి మా పేరుమీద చేసుకున్నాం. కేసీఆర్ వచ్చిన తర్వాత ధరణి పాసుపుస్తకాలు ఇచ్చారు. మా భూములు పదిలంగా ఉన్నాయి.ఎవరికీ పైసా ఖర్చు పెట్టలేదు.ధరణి ఇట్లనే ఉండాలి.కేసీఆర్ బాగుండాలి. మళ్లీ సీఎం కావాలి.

*–ఇటిక్యాల సక్కుబాయి, గృహిణి, గజ్వేల్ అర్బన్*